E-KABURU
e paper
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
08-3-2025 శనివారం | పేజీలు-6 | హైదరాబాద్
ekaburu.com




తెలంగాణలో 21 మంది ఐపీఎస్‌ల బదిలీలు

3లో



## బీఆర్ఎస్ నేతలతో భేటీ..
## కేసీఆర్ కీలక నిర్ణయం

- ఏప్రిల్ 27న లక్షలాది మందితో
- వరంగల్‌లో బహిరంగసభ
- లోక్‌సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేకపోవడంతో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది

**ప్రజల ఆకాంక్షలు ప్రతిఫలించేలా బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు.**

**(ఈ-కబురు) సిద్దిపేట:** ప్రజల ఆకాంక్షలు ప్రతిఫలించేలా భారాస రజతోత్సవ వేడుకలు ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 27న లక్షలాది మందితో వరంగల్‌లో బహిరంగసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పార్టీ నేతలతో కేసీఆర్ చర్చలు జరిపారు. పలు కీలక అంశాలపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ రజతోత్సవాలు, సంస్థాగత అంశాలు, భారాస సభ్యత్వ నమోదు, సంబంధిత అంశాలపై నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

"ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకు మరింతగా పోరాడదాం. బీఆర్ఎస్ .. తెలంగాణ సమాజ రాజకీయ అస్తిత్వ పార్టీ. తెలంగాణకు రక్షణ కవచం బీఆర్ఎస్ . రజతోత్సవ వేడుకలో తెలంగాణ సమాజమంతా భాగస్వాములే. లోక్‌సభలో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం లేకుండా పోయింది. బీఆర్ఎస్ ఎంపీలు లేకపోవడంతో రాష్ట్ర హక్కులకు భంగం కలుగుతోంది. తెలంగాణ ప్రజాప్రయోజనాలకు కేంద్రం, రాష్ట్రాలు దెబ్బతీస్తున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరులను తిప్పి కొట్టాలి" అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

# దక్షిణాదిపై బీజేపీ ప్రతీకారం

- దక్షిణాదిలో బీజేపీకి ఎక్కువ ప్రాతినిధ్యం ఉంది
- కేంద్ర ప్రభుత్వ విధానంపై దక్షిణాది రాష్ట్రాల అసంతృప్తి
- 3 నెలల్లో రూ.21 వేల కోట్లు రైతులకు రుణమాఫీ
- న్యాయసమతుల్యత కోసం దక్షిణాది రాష్ట్రాల ఐక్య పోరాటం
- రాష్ట్రాలపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కక్ష గట్టిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.



**(ఈ-కబురు ) దిల్లీ**: డీలిమిటేషన్ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవడానికే కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ నియోజకవర్గాల పునర్విభజన చేపడుతోందని విమర్శించారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్న వేళ 'ఇండియా టుడే' నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో రేవంత్ రెడ్డి శుక్రవారం మాట్లాడారు.

మీరు కన్ఫ్యూజ్ అయినట్టే మేము మూడు లక్షల కోట్లే అప్పు అనుకున్నాం.. కానీ లెక్కలు చూస్తే రూ.7 లక్షల కోట్లు అప్పు ఉందని అన్నారు. కేసీఆర్ మూడు లక్షల కోట్ల అప్పే అని చెప్పారన్నారు. తెలంగాణలో 21 వేల కోట్లు రైతులకు రుణమాఫీ.. మూడు నెలల్లో చేసింది తమ ప్రభుత్వమేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

"wదక్షిణాదిలో భాజపాకు తగిన ప్రాతినిధ్యం లేదు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ.. ఆ పార్టీ సాధించిన 240లో దక్షిణాదిలో గెలిచింది కేవలం 29 స్థానాలే. దక్షిణాదిలోని ఏ ఒక్క రాష్ట్రంలో కూడా ఆ పార్టీ అధికారంలో లేదు. ఏపీలో జూనియర్ భాగస్వామిగా

తరువాయి 2లో



## టీజీపీఎస్సీ గ్రూప్ 1, 2, 3 ఫలితాలు ఎప్పుడంటే?

లక్షలాది మంది అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న టీజీపీఎస్సీ గ్రూప్ -1, గ్రూప్ -2, గ్రూప్ -3 ఫలితాల విడుదలకు తేదీలు ఖరాయ్యాయి.

2లో



## అణు ఒప్పందంపై చర్చలకు రెడీ ఇరాన్‌కు ట్రంప్ లేఖ

# రూ.32లక్షల కోట్ల 'ముద్రా' రుణాలు..
## వారికి ఇందులో ఎన్ని సున్నాలుంటాయో తెలియదు మోదీ

**'ముద్రా' యోజన కింద రూ.32 లక్షల కోట్ల రుణాలను ఇచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు.**



**(ఈ-కబురు ) సూరత్:** కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సూక్ష్మ, చిన్న తరహా వ్యాపారాలను ప్రోత్సహించే లక్ష్యంతో 'ముద్రా' యోజన కింద రూ.32 లక్షల కోట్ల రుణాలను ఇచ్చామని పేర్కొన్నారు. సున్నా సీట్లు వచ్చిన వారు ఇందులో ఎన్ని సున్నాలు ఉంటాయో లెక్కించలేరంటూ విపక్షాలపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

"ముద్రా పథకం కింద పేద ప్రజలకు ఇప్పటివరకు రూ.32లక్షల కోట్ల రుణాలు అందించాం. మమ్మల్ని దూషించే వారు.. సున్నా సీట్లు ఉన్నవారు.. ఈ రూ.32లక్షల కోట్లలో ఎన్ని సున్నాలు ఉన్నాయో లెక్కించలేరు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సూరత్‌లో ఆహార భద్రత ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మోదీ.. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఖాతా తెరవకపోవడాన్ని ఉద్దేశిస్తూ ఈ విధంగా స్పందించారు.

**అణు ఒప్పందంపై చర్చలకు రెడీ**
**- ఇరాన్‌కు ట్రంప్ లేఖ**

ఐదు కోట్ల నకిలీ రేషన్ కార్డులను ఏరివేయడం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థను క్రమబద్ధీకరించినట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆహార భద్రతా లక్ష్యాలను సాధించేందుకు సూరత్‌లో ప్రారంభించిన ఈ కార్యక్రమం అన్ని జిల్లాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.మరోవైపు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తన సోషల్ మీడియా ఖాతాల నిర్వహణను మహిళలకే అప్పగిస్తానని ప్రధాని

తరువాయి 2లో

## కేంద్రంపై స్టాలిన్ 'డీలిమిటేషన్' వార్.. ఏడు రాష్ట్రాల సీఎంలకు లేఖ

డీలిమిటేషన్ అంశంలో కేంద్రప్రభుత్వంపై స్టాలిన్ తన పోరాటాన్ని తీవ్రం చేశారు. ఈ క్రమంలో దక్షిణాది రాష్ట్రాలతో కలిసి ముందుకు వెళ్లేందుకు గట్టి ప్రయత్నాలు ప్రారంభించారు.

2లో



## పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు.. కేంద్రంపై ఒత్తిడికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

2లో



## తమిళ భాషకు గుర్తింపు ఇస్తాం.. అమిత్ షా కీలక వ్యాఖ్యలు



3లో

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు.. సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీ..



# దక్షిణాదిపై బీజేపీ ప్రతీకారం

మొదటి పేజి తరువాయి

ఉంది. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని భాజపా భావిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలకు మేలు చేకూర్చేలా డీలిమిటేషన్‌కు సిద్ధమవుతోంది'' అని రేవంత్ రెడ్డి అన్నారు.

**పెంచాల్సిన వేతనాలు తగ్గించడమా.. ఇదేం పాలన?: బండి సంజయ్**

కేంద్రం ఆదేశాల మేరకే తాము (దక్షిణాది రాష్ట్రాలు) కుటుంబ నియంత్రణను సమగ్రంగా అమలు చేశామని రేవంత్ రెడ్డి అన్నారు. మరో 30ఏళ్లు డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేయాలని, అప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ఏవిధంగా పెరుగుతుందో చూడాలన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రో రేటా విధానంలో సీట్ల పెంపు చేపడితే యూపీలో ప్రస్తుతం ఉన్న 80 సీట్లు 120కి పెరుగతాయన్నారు. తమిళనాడులో 39 నుంచి 60కి మాత్రమే చేరుతాయని అభిప్రాయపడ్డారు. కేవలం దక్షిణాదిలోనే కాదని ఉత్తరాదిలోని పంజాబ్ వంటి రాష్ట్రాలకూ డీలిమిటేషన్ వల్ల నష్టం జరుగుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి బిమారీ రాష్ట్రాలకు మాత్రమే దీంతో లబ్ధి జరుగుతుందని తెలిపారు.

# రూ.32లక్షల కోట్ల 'ముద్రా' రుణాలు..

మొదటి పేజి తరువాయి

మోదీ ఈ సందర్భంగా ప్రకటించారు. ఇదిలాఉంటే, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో ' ప్రధానమంత్రి ముద్రా యోజన' కింద రుణాలు ఇచ్చే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం 2015 లో ప్రారంభించిన విషయం తెలిసిందే.



## అణు ఒప్పందంపై చర్చలకు రెడీ
# ఇరాన్‌కు ట్రంప్ లేఖ

**ఇరాన్‌తో అణు ఒప్పందానికి తాను సిద్ధమేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.**

**(ఈ-కబురు )** అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి లేఖ రాసినట్లు చెప్పారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. చర్చలకు వారు అంగీకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

''ఇరాన్ ముందు రెండు మార్గాలున్నాయి. సైన్యం, లేదా ఒప్పందం చేసుకోవడం. ఒప్పందానికే నేను ప్రాధాన్యం ఇస్తా. ఎందుకంటే ఇరాన్‌ను దెబ్బతీయాలనుకోవడం లేదు. చర్చలు జరుపుతారని ఆశిస్తున్నా. ఇరాన్‌కు అది చాలా ప్రయోజనకరం'' అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

**ట్రంప్‌తో వాగ్వాదం ఎఫెక్ట్.. ఉక్రెయిన్‌కు కీలక శాటిలైట్ చిత్రాలు కట్!**

ఇరాన్ మరో అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోవడాన్ని నిలువరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఇదే అంశంపై ఇటీవల మాట్లాడిన ట్రంప్.. దాన్ని నిరోధించేందుకు గాను వారితో ఒప్పందం చేసుకోవాలని అనుకుంటున్నానని చెప్పారు. ఇదిలాఉంటే, ఇరాన్‌తో గతంలో అణు ఒప్పందం చేసుకున్న అమెరికా.. 2018లో ట్రంప్ హయాంలోనే దాన్నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే.




## పాతబస్తీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో
# అగ్ని ప్రమాదం

**పాతబస్తీ మదీనా ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది.**

**(ఈ-కబురు ) హైదరాబాద్:** పాతబస్తీ మదీనా ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఘాన్సీ బజార్‌లోని ఐదంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని నాలుగు ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలు ఆర్పివేసేందుకు ప్రయత్నిస్తున్నారు. భవనం పైఅంతస్తులో చిక్కుకుపోయిన వారిని క్రేన్ల సాయంతో సురక్షితంగా కిందకు తీసుకొచ్చారు. మంటలు ఇతర భవనాలకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది కట్టడి చేస్తున్నారు.

# కేంద్రంపై స్టాలిన్ 'డీలిమిటేషన్' వార్..

## ఏడు రాష్ట్రాల సీఎంలకు లేఖ

**దిల్లీ:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్రంపై పోరాడుతున్నారు. ఈ విషయంపై తాజాగా ఏడు రాష్ట్రాల సీఎంలకు లేఖ రాశారు. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ కసరత్తుకు వ్యతిరేకంగా 'జాయింట్ యాక్షన్ కమిటీ' ఏర్పాటు చేద్దామని పిలుపునిచ్చారు. ఇటీవల తమిళనాడులో స్టాలిన్ నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో జరిగిన తీర్మానం ఆధారంగా ఈ లేఖలు రాశారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ్ బెంగాల్, ఒడిశాకు వీటిని పంపారు.సమష్టి కార్యాచరణ కోసం మార్చి 22న చెన్నైలో సమావేశానికి హాజరుకావాలని కోరారు. అలాగే ఈ రాష్ట్రాలకు చెందిన సీనియర్ నేతలు, అధికార, ప్రతిపక్ష నాయకులను ఆయన ఆహ్వానించారు. ''డీలిమిటేషన్ అనేది సమాఖ్యవాదంపై చేస్తోన్న దాడి. ఇది పార్లమెంట్‌లో మన హక్కులకు కోత పెట్టి, జనాభాను నియంత్రించిన రాష్ట్రాలను శిక్షించడమే అవుతుంది. ఈ అన్యాయాన్ని మేం సహించబోం'' అని స్టాలిన్ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు.

**ఏమిటీ డీలిమిటేషన్ వివాదం..?**

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన 2026లో జరగనుంది. ఇందుకు అనుసరించే విధివిధానాల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందన్న ఆందోళన రేగుతోంది. జనాభా తక్కువగా ఉండటంతో లోక్‌సభలో వాటి ప్రాతినిధ్యానికి కోత పడుతుందన్న భయాలున్నాయి. కుటుంబ నియంత్రణ పాటించడంలో దక్షిణాది రాష్ట్రాలు సాధించిన విజయమే వాటి పాలిట శాపం కానుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జనాభా నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో అధిక జనాభా కలిగిన ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లు లోక్‌సభలో తమ సీట్ల సంఖ్యను ఇప్పటికన్నా పెంచుకోనున్నాయి.

ఫలితంగా కేంద్రం నుంచి తమకు రావాల్సిన నిధుల కోసం డిమాండ్ చేసే సత్తా దక్షిణాది రాష్ట్రాలకు తగ్గిపోతుందనే ప్రచారం జరుగుతోంది. పర్యవసానంగా ఉత్తరదక్షిణ విభేదాలు, ప్రాంతీయ ఉద్రిక్తతలు పెచ్చరిల్లే ప్రమాదముంది. తాము నిర్లక్ష్యానికి గురవుతున్నామనే భావన దక్షిణ భారత రాష్ట్రాల్లో వ్యాపిస్తోంది.

అందుకే జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను తమిళనాడు పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రస్తుతం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ఈ అంశంలో కేంద్రంతో పోరాడుతోంది. పార్లమెంటు సభ్యుల సంఖ్యను పెంచే పక్షంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా ఇరు సభల్లో రాష్ట్రాల మధ్య ప్రస్తుతమున్న నిష్పత్తి మేరకు నియోజకవర్గాల సంఖ్యను పెంచడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.



## పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు..
## కేంద్రంపై ఒత్తిడికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



**(ఈ-కబురు )హైదరాబాద్:** కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిసి మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, ఆర్‌ఆర్ఆర్ తదితర అంశాలపై విన్నవించారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధనకు పార్లమెంట్‌లో ఎంపీలు ప్రస్తావించే విధంగా ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగా ప్రజాభవన్‌లో ఈ నెల 8న (శనివారం) అన్ని పార్టీల ఎంపీల సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది.

తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఈ భేటీ జరగనుంది. కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. ఎంపీల సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈమేరకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో రాష్ట్రంలోని అందరు ఎంపీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి భేటీకి ఆహ్వానించారు.

# లోకేష్ తో కలిసి నామినేషన్ వేసిన నాగబాబు





**(ఈ-కబురు ):** ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా జనసేన నేత నాగబాబు నామినేషన్ దాఖలు చేశారు. ఏపీ అసెంబ్లీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. నాగబాబు అభ్యర్థిత్వాన్ని మంత్రి నారా లోకేష్ బలపరిచారు. ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కూటమి అభ్యర్థిగా నాగబాబు నామినేషన్ వేశారు. అందుకు సంబంధించిన పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నాగబాబు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, బొల్లిశెట్టి శ్రీనివాస్, కొణతల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## టీజీపీఎస్సీ గ్రూప్
# 1, 2, 3 ఫలితాలు ఎప్పుడంటే?

**లక్షలాది మంది అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న టీజీపీఎస్సీ గ్రూప్ -1, గ్రూప్ -2, గ్రూప్ -3 ఫలితాల విడుదలకు తేదీలు ఖరాయ్యాయి.**

**(ఈ-కబురు ) హైదరాబాద్:** లక్షలాది మంది అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న టీజీపీఎస్సీ గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఫలితాల విడుదలకు తేదీలు ఖరాయ్యాయి. శుక్రవారం జరిగిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న అనేక నోటిఫికేషన్ల స్థితిని సమీక్షించడంతో పాటు ఇప్పటికే నిర్వహించిన పలు పరీక్షల జనరల్ ర్యాంకింగ్ /ఫలితాల విడుదలకు సంబంధించిన షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు.

గ్రూప్ 1 ఉద్యోగ నియామక పరీక్షలో అభ్యర్థులు సాధించిన ప్రొవిజినల్ మార్కుల వివరాలను మార్చి 10న ప్రకటించనున్నారు. అలాగే, గ్రూప్2 అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ జాబితా మార్చి 11న, గ్రూప్ 3 పరీక్ష జనరల్ ర్యాంకింగ్ జాబితాను మార్చి 14న విడుదల చేస్తారు. వీటితో పాటుగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలను మార్చి 17న, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగ పరీక్షల తుది ఫలితాలను మార్చి 19న ప్రకటించనున్నారు. రాష్ట్రంలో 563 గ్రూప్1 ఉద్యోగాలు, 783 గ్రూప్2, 1,365 గ్రూప్3 పోస్టులతో పాటు 581 వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాలకు గతంలో పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే.

**తప్పుడు సమాచారం నమ్మొద్దు.. ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయండి**

గ్రూప్1 ఉద్యోగ నియామకాలపై ఎలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మొద్దని టీజీపీఎస్సీ ఇటీవల విజ్ఞప్తి చేసింది. ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు సూచించిన అన్ని నియమాలు, విధానాలను కమిషన్ పాటిస్తుందని స్పష్టం చేసింది. ఎవరైనా మధ్యవర్తులు కమిషన్ సిబ్బందితో గానీ, మరే అధికారితో గానీ పరిచయాలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, సమాచారాన్ని పొందడంలో సహాయం చేస్తామని సంప్రదిస్తే అలాంటి అభ్యర్థులు వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఆధారాలతో సహా ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ప్రకటనలో కోరింది. ఆ సమాచారాన్ని పోలీసు కంప్లయింట్‌తో కలిపి కమిషన్‌కు ఫిర్యాదు చేసేలా మొబైల్ నంబర్ (9966700339), ఈ మెయిల్ ఐడీ (vigilance@tspsc.gov.in) ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించింది.

ఉద్యోగాలు కల్పిస్తామని, తప్పుడు వాగ్దానాలు ఇచ్చిన మధ్యవర్తులు లేదా వ్యక్తుల గురించి నేటికీ కమిషన్‌కు ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని తెలిపింది. అందువల్ల సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందుతున్న వార్తలు పూర్తిగా నిరాధారం, సత్యదూరమని.. కమిషన్‌ను అప్రతిష్టపాలుచేసేందుకు, నిరుద్యోగ యువతలో గందరగోళం సృష్టించాలనే ఉద్దేశమే అందులో ఉందని పేర్కొంది. అలాంటి వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకొనేందుకు కమిషన్ వెనుకాడబోదని స్పష్టం చేసింది. పరీక్షల్లో కమిషన్ పారదర్శకమైన పూర్తిస్థాయి నియామక విధానాలను అనుసరిస్తుందనే విషయాన్ని అభ్యర్థులు గమనించాలని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం కోరారు.




# తెలంగాణలో 21 మంది ఐపీఎస్‌ల బదిలీలు

**తెలంగాణలో 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.**

**(ఈ-కబురు ) హైదరాబాద్:** తెలంగాణలో 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారుల్లో ఒక అడిషనల్ డీజీ, ఇద్దరు ఐజీలు, ఇద్దరు డీఐజీలు, ఇద్దరు నాన్ కేడర్ ఎస్పీలు ఉన్నారు. మిగిలిన 14 మంది ఎస్పీలకు స్థాన చలనం కల్పించారు.

- కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలం
- అదనపు డీజీ (పర్సనల్)గా అనిల్ కుమార్. ఎస్పీఎఫ్ డైరెక్టర్‌గా ఆయనకు అదనపు బాధ్యతలు
- సీఐడీ ఐజీగా ఎం.శ్రీనివాసులు
- వరంగల్ సీపీగా సన్‌ప్రీత్ సింగ్
- నిజామాబాద్ సీపీగా సాయి చైతన్య
- రామగుండం సీపీగా అంబర్ కిషోర్
- ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధుశర్మ
- భువనగిరి డీసీపీగా ఆకాంక్ష యాదవ్
- మహిళ భద్రతా విభాగం ఎస్పీగా చేతన
- నార్కొటిక్ బ్యూరో ఎస్పీగా రూపేష్
- కామారెడ్డి ఎస్పీగా రాజేష్ చంద్ర
- సంగారెడ్డి ఎస్పీగా పారితోష్ పంకజ్
- రాజన్న సిరిసిల్ల ఎస్పీగా జీఎం బాబా సాహెబ్
- వరంగల్ డీసీపీగా అంకిత్ కుమార్
- మంచిర్యాల డీసీపీగా ఎ.భాస్కర్
- సూర్యాపేట ఎస్పీగా కె.నర్సింహ
- హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీగా శిల్పవల్లి
- ఎస్ఐబీ ఎస్పీగా సాయి శేఖర్
- పెద్దపల్లి డీసీపీగా కరుణాకర్
- సీఐడీ ఎస్పీగా రవీందర్



# ఆ ప్రదేశంలో ఆగిన క్యాడవర్ డాగ్స్.. రెస్క్యూ ఆపరేషన్‌లో కీలక పరిణామం

**(ఈ-కబురు ) నాగర్ కర్నూల్/మహబూబ్‌నగర్:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మూడు మృతదేహాల స్పాట్‌స్‌ను క్యాడవర్ డాగ్స్ గుర్తించాయి. జీపీఆర్ ద్వారా మార్క్ చేసిన ప్రదేశంలోనే క్యాడవర్ డాగ్స్ ఆగాయి. ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది కార్మికుల జాడ రెండు వారాలైనా లభించకపోవడంతో రెస్క్యూ ఆపరేషన్‌లో సాయం చేసేందుకు కేరళ పోలీసు శాఖకు చెందిన కడావర్ డాగ్స్‌ను రాష్ట్ర ప్రభు త్వం రంగంలోకి దించిన సంగతి తెలిసిందే. కేరళలోని త్రిసూర్ నుంచి రెండు కడావర్ జాగిలాలతోపాటు వాటి శిక్షకులను దోమలపెంటకు రప్పించింది.

నేషనల్ డిజా స్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఎంఏ), కేంద్ర హోంశాఖ కార్యదర్శి కల్నల్ కీర్తిప్రకాశ్ సింగ్ ఆధ్వర్యంలో రెండు సైనిక హెలికాప్టర్లలో ఆ శునకాలు, శిక్షకులు వచ్చారు. ముందుగా ప్రమాదస్థలం వద్ద పరిస్థితులను పరిశీలించేందుకు కల్నల్ కీర్తి ప్రకాశ్‌సింగ్‌తోపాటు కేరళ పోలీసు అధికారి ప్రభాత్ నేతృత్వంలో కడావర్ డాగ్స్ రెస్క్యూ బృందం సొరంగంలోకి వెళ్లింది.

8 మంది కార్మికుల ఆచూకీ కోసం 14 రోజులుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది. అయినా ఇప్పటి వరకు గల్లంతైన వారి జాడ దొరకలేదు. 12 విభాగాలకు చెందిన దాదాపు 650 మంది సభ్యులు నిరంతం షిఫ్టుల వారిగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. తాజాగా ఇవాళ టన్నెల్‌లో చిక్కుకున్న వారి అచూకీ కనుగొనేందుకు కేరళ రాష్ట్రం నుంచి ప్రత్యేక శిక్షణ పొందిన రెండు క్యాడవర్ డాగ్స్‌ను సొరంగంలోకి పంపించారు. ఉదయం ఏడున్నర గంటలకు లోకో ట్రైన్‌లో వాటిని లోపలికి తీసుకెళ్లారు. తిరిగి మధ్యాహ్నం రెండున్నరకు బయటకు తీసుకొచ్చారు. తప్పిపోయిన వారి ఆనవాళ్లకు సంబంధించి పలు అనుమానిత ప్రాంతాలను డాగ్స్ గుర్తించినట్టు చెబుతున్నారు. వాటి ఆధారంగా తదుపరి చర్యలపై అధికారులు సమీక్ష చేస్తున్నారు.

**శుక్రవారం ఉదయం 7 గంటలకు రెండు కడావర్ డాగ్స్‌తో కలసి సొరంగంలోని ప్రమాదస్థలం వద్ద కార్మికుల జాడ కోసం సహాయ బృందం గాలింపు చర్యలు చేపట్టింది. గతేడాది కేరళలోని మున్నార్ సమీపంలో పెట్టిముడి వద్ద కొండచరియలు విరిగి మట్టిలో కూరుకుపోయిన నలుగురిని కడావర్ డాగ్స్ గుర్తించగలిగాయి. మట్టిలో 10–15 అడుగుల లోతులో కూరుకు పోయిన మానవ అవశేషాలను ఈ శునకాలు పసిగడతాయి.**

టన్నెల్‌లోకి నలుగురు సభ్యులతో కూడిన ఎన్‌వీ రోబోటిక్ నిపుణుల బృందం వెళ్లింది. వారితో పాటు ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ కూడా వెళ్లి అందులో అధ్యయనం చేశారు. మరో వైపు కన్వేయర్ బెల్ట్ కూడ పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావటంతో సహాయచర్యలు వేగవంతమయ్యాయి. సొరంగంలో కూరుకుపోయిన మట్టి, బురదను తొలగిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే నిపుణులతో ప్లాస్మాకట్టర్స్ ద్వారా టీబీఎం మిషన్ భాగాలు కట్ చేస్తూ వాటిని లోకో ట్రైన్ ద్వారా బయటికి తీసుకొస్తున్నారు.

టీబీఎంపై ఉన్న మట్టిని వాటర్‌గన్‌తో తొలగిస్తున్నారు. కాని జీపీఆర్ అనుమానిత ప్రాంతాల్లో జరుపుతున్న తవ్వకాల్లో పెద్దఎత్తున సీఫేజ్ వాటర్ వస్తుండటంతో సహాయక చర్యలకు కొంత అవరోధం ఏర్పడుతుంది. మరోవైపు అదనపు మోటార్లు ఏర్పాటు చేసి సీఫేజ్ వాటర్‌ను త్వరిత గతిన బయటికి పంపే ప్రక్రియను చేపడుతున్నారు. మొత్తంగా టన్నెల్‌లో ఇరుకున్న వారి ఆచూకీని కనుగొనేందుకు అనేక చర్యలు చేపడుతున్నా ఇప్పటికీ 8 మంది ఆచూకీ దొరకపోవటంతో ఆందోళన వ్యక్తం అవుతుంది. గడచిన 14 రోజులుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బాధిత కుటుంబ సభ్యులు తమ వారి ఆచూకీ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.



# తమిళ భాషకు గుర్తింపు ఇస్తాం.. అమిత్ షా కీలక వ్యాఖ్యలు

**తమిళనాడులో హిందీ భాషా వివాదం దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. తమిళ భాషకు కేంద్ర ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందని తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. భాషా విషయంలో స్టాలిన్ రాజకీయం చేయడం సరైంది కాదన్నారు.**

తమిళనాడులో హిందీ భాషా వివాదం దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. సీఎం స్టాలిన్, కేంద్ర మంత్రులు ఒకరినొకరు తీవ్రంగా విమర్శలు చేసుకుంటున్నారు. ఇటీవల స్టాలిన్ చేసిన వ్యాఖ్యలకు కేంద్రం హోం మంత్రి అమిత్ షా తాజాగా స్పందించారు. తమిళ భాషకు కేంద్ర ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందని తెలిపారు. భాషా విషయంలో స్టాలిన్ రాజకీయం చేయడం సరైంది కాదన్నారు. ఇక వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం అమిత్ షా రాణిపేటలో పర్యటించారు. సీఐఎస్ఎఫ్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

ఈ సందర్భంగా అమిత్ షా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. '' ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో ఉన్నత విద్య కోసం తమిళ భాషలోనే సిలబస్‌ను తీసుకొస్తాం. ఇందుకోసం వెంటనే చర్యలు చేపడతాం. తమిళ భాష సంస్కృతికి, అభివృద్ధికి మేము కట్టుబడి ఉన్నాం. దేశంలోని ప్రాంతీయ భాషలను మేము గౌరవిస్తాం. ఇప్పటిదాకా సీఏపీఎఫ్ నియామకంలో చూసుకుంటే మాతృభాషకు స్థానం లేదు. దూనివల్ల యువతకు నష్టం జరుగుతోందని ప్రధాని మోదీ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నారు. అన్ని భాషలతో పాటు తమిళ భాషలో కూడా సీఏపీఎఫ్ పరీక్షలు నిర్వహించాలని ఆయన నిర్ణయించారు. స్టాలిన్ ఇకనుంచైనా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని'' అమిత్ షా అన్నారు.

# గ్రేటర్ హైదరాబాద్‌లో ఆస్తి పన్ను చెల్లింపు.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్,:** హైదరాబాద్ నగర వాసులకు జీహెచ్ఎంసీ శుభవార్త చెప్పింది. ఆస్తి పన్ను చెల్లింపులో వడ్డీపై 90 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే గతేడాది బకాయిదారులకు బల్దియా వన్ టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని కల్పిచ్చింది.

తాజాగా, మరోసారి ఆ అవకాశాన్ని కల్పిస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెలాఖరు వరకు పెండింగ్ ప్రాపర్టీ ట్యాక్స్ కట్టేవారికి ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది.



తద్వారా 202425 సంవత్సరానికి కేవలం 10 శాతం వడ్డీతో బకాయిదారులంతా తమ ఆస్తి పన్నును చెల్లించే వెసులుబాటు కలుగుతుంది. అయితే,ఈ ఓటీఎస్ ద్వారా పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ ట్యాక్స్ వసూలవుతుందని జీహెచ్ఎంసీ అధికారులు భావిస్తున్నారు. సుమారు రెండు వేల కోట్ల ఆస్తి పన్ను లక్ష్యంగా తెలంగాణ సర్కారు ఈ ని ర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు..

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీ..

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి మరోసారి సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన భేటీ అయ్యే మంత్రిమండలి మొత్తం 14 ప్రధాన అంశాలు అజెండాగా చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల చట్టసవరణ బిల్లు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి చట్టసవరణ బిల్లులకు మంత్రిమండలి ఆమోదం తెలపనుంది. అలాగే వివిధ సంస్థలకు భూ కేటాయింపులపైనా క్యాబినెట్ ఆమోదముద్ర వేయనున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు కుప్పంలో డిజిటల్ హెల్త్ కేంద్రం ఏర్పాటుకూ గ్రీన్ సిగ్నల్ పడనుంది. వైద్యారోగ్యశాఖలో 372 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకీ పచ్చజెండా ఊపనున్నట్లు తెలుస్తోంది. 2024 29 ఏపీ పర్యాటక విధానంపైనా మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. కాగా, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల కాలంలోనే ఇప్పటికే పలు మార్లు భేటీ అయిన క్యాబినెట్ మంత్రులు వివిధ అంశాలకు సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు.



# యాపిల్ ఫోల్డబుల్ ఐఫోన్ లాంచ్ ఎప్పుడంటే?

**వివో, మోటోరోలా, శాంసంగ్ వంటి కంపెనీలు ఇండియన్ మార్కెట్లో ఫోల్డబుల్ ఫోన్స్ లాంచ్ చేసి విక్రయిస్తున్నాయి. ఈ విభాగంలో 'యాపిల్' కూడా చేరనున్నట్లు తెలుస్తోంది. ఈ ఫోన్ ఎప్పుడు మార్కెట్లో లాంచ్ అవుతుంది? ధర ఎంత ఉంటుందనే వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.**

యాపిల్ కంపెనీ ఇప్పటి వరకు.. ఫోల్డబుల్ ఫోన్స్ లాంచ్ చేయలేదు. మొదటిసారి ఈ రకమైన స్మార్ట్‌ఫోన్ లాంచ్ చేయడానికి సన్నద్ధమైంది. సంస్థ దీనిని 2026లో లాంచ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ధర కూడా 2000 డాలర్లు (రూ. 1.73 లక్షలు) ఉండొచ్చని సమాచారం.

ఫోల్డబుల్ ఐఫోన్ లాంచ్ గురించి యాపిల్ కంపెనీ అధికారిక సమాచారం వెల్లడించలేదు. ఒకవేళా ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ లాంచ్ నిజమైతే.. ఇదే మార్కెట్లో అత్యంత ఖరీదైనదిగా మారనుంది. ప్రతి ఏటా కొత్త ఉత్పత్తులను లాంచ్ చేసే యాపిల్.. ఫోల్డబుల్ ఫోన్ లాంచ్ చేస్తుందనుకోవడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ పరిశ్రమ అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. యాపిల్ కంపెనీ మాత్రం సైలెంట్‌గా ఉంది. కాగా త్వరలోనే ఫోల్డబుల్ ఫోన్ లాంచ్ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇది స్టెయిన్‌లెస్ స్టీల్ వంటి వాటితో తరవుతుందని తెలుస్తోంది. అయితే ఇందులో ఫేస్ ఐడీ ఫీచర్ మిస్ అయ్యే అవకాశం ఉంది. టచ్ ఐడీ ఫీచర్ అనేది సైడ్ బటన్ ద్వారా అందుబాటులో ఉంటుందని తెలుస్తోంది.

ఫోల్డబుల్ ఐఫోన్‌లో 5.5 ఇంచెస్ కవర్ డిస్‌ప్లే, 7.8 ఇంచెస్ మెయిన్ ఫోల్డింగ్ డిస్‌ప్లే వంటివి పొందవచ్చని సమాచారం. ఈ ఫోన్ వెనుక డ్యూయెల్ కెమెరా సెటప్ ఉంటుంది. రెండు సెల్ఫీ కెమెరాలు ఉండనున్నాయి. ఇప్పటివరకు లీకైన ఫీచర్స్ అద్భుతంగానే ఉన్నాయని తెలుస్తోంది. కానీ దీని పనితీరు గురించి తెలుసుకోవాలంటే.. లాంచ్ అయ్యే వరకు వేచి చూడాల్సిందే.*




# 20 రాష్ట్రాలు.. 100 స్టేషన్లు ఫుడ్ డెలివరీలో స్విగ్గీ హవా

**ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ .. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ భాగస్వామ్యంతో దేశంలోని 20 రాష్ట్రాలలో 100 రైల్వే స్టేషన్లకు తన సేవలను విస్తరించింది. రాబోయే రోజుల్లో మరిన్ని రైల్వే స్టేషన్లకు ఈ సదుపాయాన్ని విస్తరించనున్నట్లు కంపెనీ వెల్లడించింది.**

నిజానికి రైలు ప్రయాణం అనేది.. భారతదేశ సంస్కృతిలో అంతర్భాగమైపోయింది. ఈ ప్రయాణంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. రైళ్లలో స్విగ్గీ ఫుడ్‌ను 100 స్టేషన్లకు విస్తరించడం వల్ల ప్రయాణీకులకు ఎక్కువ సౌలభ్యంగా ఉంది. అంతే కాకుండా దేశవ్యాప్తంగా విభిన్న రకాల భోజనాలను రుచి చూసే అవకాశం లభించిందని.. స్విగ్గీ ఫుడ్ మార్కెట్ ప్లేస్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మాలూ అన్నారు.

స్విగ్గీ 2024 మార్చిలో ఐఆర్‌సీటీసీతో ఒప్పందం కుదుర్చుకున్న తరువాత.. సీటుకు గ్యారెంటీ డెలివరీ (లేదా పూర్తి వాపసు) ప్రకటించింది. తాము ఎక్కడైతే ఫుడ్ డెలివరీ చేసుకోవాలనుకుంటున్నారో.. ముందు స్టేషన్‌లోనే నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేసుకోవచ్చు. అప్పుడు తాము చేరుకునే సమయానికి ఫుడ్ డెలివరీ అవుతుంది. జొమాటో కూడా ఈ తరహా ఫుడ్ డెలివరీ చేస్తోంది. ఈ రెండు సంస్థలు రోజుకు లక్ష కంటే ఎక్కువ ఫుడ్ డెలివరీలు చేస్తున్నట్లు సమాచారం.



# బంగారం.. ఇలా తగ్గితే కొనేస్తాం..!

బంగారం ధరలు ద్రవ్యోల్బణం, గ్లోబల్ ధరలలో మార్పు, సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్, హెచ్చుతగ్గుల వడ్డీ రేట్లు, నగల మార్కెట్‌లతో సహా అనేక అంతర్జాతీయ కారకాలపై ఆధారపడి ఉంటాయి. నేటి బంగారం ధరలు ఏయే ప్రాంతాల్లో ఎలా ఉన్నాయనేది ఈ కథనంలో తెలుసుకుందాం.

**తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు వంటి ప్రాంతాల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 79,900, 24 క్యారెట్ల పసిడి రేటు రూ. 87,160 వద్ద ఉన్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు రూ.300, రూ.330 చొప్పున తగ్గాయి.

**ఇతర ప్రాంతాల్లో..**

దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.87,310 వద్ద, 22 క్యారెట్ల పసిడి ధర రూ.80,050 వద్ద ఉన్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు రూ.330, రూ.300 చొప్పున క్షీణించాయి.

చైన్నైలో బంగారం ధరల విషయానికి వస్తే.. ఇక్కడ 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 79,900 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 87,160 వద్దకు వచ్చాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు రూ.300, రూ.330 చొప్పున కరిగాయి. బెంగళూరు, ముంబై ప్రాంతాల్లోనూ ఇవే ధరలు ఉన్నాయి.

**వెండి ధరలు రివర్స్**

దేశవ్యాప్తంగా బంగారం ధరలు తగ్గుముఖం పట్టగా వెండి ధరల్లో మాత్రం నేడు పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి కేజీ ధర రూ.100 పెరిగి రూ.1,08,100 వద్దకు చేరింది. ఇక ఢిల్లీలో కేజీ వెండి రూ. 99,100 వద్ద కొనసాగుతోంది. నిన్నటితో పోలిస్తే రూ.100 పెరిగింది.



**దేశంలో పెరుగుతున్న బంగారం ధరలు రెండు రోజులుగా కొనుగోలుదారులకు ఊరటనిస్తున్నాయి. నేడు వరుసగా రెండో రోజూ పసిడి ధరలు దిగివచ్చాయి. అంతకుముందు వరుస పెరుగుదలతో బెంబేలెత్తించిన బంగారం ధరలు ఇప్పుడు క్షీణిస్తుండటంతో పసిడి ప్రియులు కుదటపడి కొనుగోళ్లకు మొగ్గుచూపిస్తున్నారు.**



## క్యాస్ట్రాల్ ఇండియాపై అరామ్‌కో కన్ను..

# దూసుకెళ్లిన షేర్లు

**న్యూఢిల్లీ:** గత నాలుగు రోజులుగా ర్యాలీ బాటలో సాగుతున్న లూబ్రికెంట్స్ తయారీ దిగ్గజం క్యాస్ట్రాల్ ఇండియా కౌంటర్‌కు మరోసారి డిమాండ్ పెరిగింది. దీంతో బీఎస్‌ఈలో షేరు 11 శాతం జంప్‌చేసి రూ. 246 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలోనూ 10 శాతం ఎగసి రూ. 245 వద్ద నిలిచింది. ఒక దశలో 13.4 శాతం దూసుకెళ్లి రూ. 252 వద్ద గరిష్టానికి చేరింది.

ఎన్‌ఎస్‌ఈలో 7.39 కోట్ల షేర్లు, బీఎస్‌ఈలో 23.62 లక్షల షేర్లు ట్రేడయ్యాయి. బీపీ(గతంలో బ్రిటిష్ పెట్రోలియం)కు చెందిన లూబ్రికెంట్ బిజినెస్‌ను సౌదీ చమురు దిగ్గజం అరామ్‌కో కొనుగోలు చేయనున్నట్లు వెలువడిన వార్తలు షేరుపై సానుకూల ప్రభావం చూపుతున్నాయి. దీంతో వరుసగా నాలుగో రోజు క్యాస్ట్రాల్ ఇండియా బలపడింది.

**10 బిలియన్ డాలర్లు..**

క్యాస్ట్రాల్ బ్రాండుతో బీపీ.. లూబ్రికెంట్స్ విక్రయించే సంగతి తెలిసిందే. బీపీ ఇటీవల పునర్వ్యవస్థీకరణలో భాగంగా లూబ్రికెంట్స్ విభాగం విలువను దాదాపు 10 బిలియన్ డాలర్లుగా మదింపు చేసినట్లు తెలుస్తోంది! కాగా.. వాల్వోలైన్ లూబ్రికెంట్స్ యూనిట్‌తో క్యాస్ట్రాల్ ఆస్తులను జత చేసే యోచనలో అరామ్‌కో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

2023లో 2.65 బిలియన్ డాలర్లకు వాల్వోలైన్‌ను అరామ్‌కో కొనుగోలు చేసింది. భారత్, చైనా, ఆగ్నేయ ఆసియాలో అదనపు రిఫైనింగ్, కెమికల్స్ బిజినెస్‌ల కొనుగోలుకి చూస్తున్నట్లు అరామ్‌కో గతేడాది పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో క్యాస్ట్రాల్ ఇండియా కొనుగోలుపై అంచనాలు పెరిగినట్లు నిపుణులు తెలియజేశారు.




### రోజుకు 10 లక్షల 'టీ'ల విక్రయం..

## వచ్చే ఏడాది 'చాయ్ పాయింట్' లిస్టింగ్

**న్యూఢిల్లీ:** టీ, కాఫీ చైన్.. చాయ్ పాయింట్ 2026 మే నెలకల్లా స్టాక్ ఎక్స్చేంజీలలో లిస్టయ్యే ప్రణాళికల్లో ఉంది. ఈ అంశాన్ని ప్రతిరోజు సుమారు 9 లక్షల కప్పుల టీ, కాఫీ విక్రయిస్తున్న సంస్థ సహవ్యవస్థాపకుడు తరుణ్ ఖన్నా తెలియజేశారు. అయితే కుంభమేళాలో రోజుకి 10 లక్షలకంటే అధికంగా విక్రయించినట్లు తెలియజేశారు.ముంబైలో తమ విద్యార్థి అములీక్ సింగ్ బిజ్రాల్‌తో కలసి ఒక కేఫ్‌లో టీ తాగే సమయంలో 2009లో చాయ్ పాయింట్ ప్రారంభించే ఆలోచన వచ్చినట్లు హార్వార్డ్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఖన్నా వెల్లడించారు. ప్లాస్టిక్ కప్పులలో అంత శుభ్రతలేని విధంగా అందిస్తున్న చాయ్ స్థానే అత్యున్నత నాణ్యతతో, పరిశుభ్రంగా అందుబాటు ధరలో సువాసనలతో కూడిన చాయ్ అందించాలనే ఆలోచనతో చాయ్ పాయింట్‌కు తెరతీసినట్లు వివరించారు. దీంతో టీ అందించే వ్యక్తు(చోటూ)లకు ఉపాధిని సైతం కల్పించవచ్చని భావించినట్లు తెలియజేశారు. దీంతో 2010లో బెంగళూరులోని కోరమంగళలో తొలి ఔట్‌లెట్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అములీక్‌తో కలిసి ఐదుగురు ఉద్యోగులతో బిజినెస్‌ను మొదలుపెట్టినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రోజుకి 90 లక్షల కప్పుల టీ, కాఫీలను విక్రయిస్తున్నట్లు తెలియజేశారు.

## నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్లు..

# బలహీనంగా ఐటీ, బ్యాంక్ షేర్లు

**దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. బలహీన అంతర్జాతీయ సంకేతాల మధ్య బెంచ్ మార్క్ ఈక్విటీ ఇండెక్స్ బీఎస్ఈ సెన్సెక్స్ 176.47 పాయింట్లు లేదా 0.24 శాతం క్షీణించి 74,163.62 వద్ద మొదలైంది. ఇక నిఫ్టీ 50 ప్రారంభ సమయానికి 40.85 పాయింట్లు లేదా 0.18 శాతం క్షీణించి 22,503 వద్ద ఉంది.**

బలహీన అంతర్జాతీయ సంకేతాల మధ్య నిఫ్టీ ఐటీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు ఎన్‌ఎస్‌ఈలో ప్రారంభ ట్రేడింగ్ లో ఒత్తిడికి లోనయ్యాయి. ఐటీ ఇండెక్స్ 0.97 శాతం, ఎఫ్ఎంసీజీ 0.12 శాతం, బ్యాంక్ 0.12 శాతం, ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.06 శాతం నష్టపోయాయి.

విస్తృత మార్కెట్ సూచీలు ప్రారంభ ట్రేడింగ్ లో మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 0.34 శాతం, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 0.09 శాతం నష్టపోయాయి.





అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు దేశ ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తాయన్న భయాలే ఈ రోజు స్టాక్ మార్కెట్లలో అమ్మకాలకు కారణం కావచ్చు. యునైటెడ్ స్టేట్స్‌మెక్సికోకెనడా ఒప్పందం కిందకు వచ్చే కొన్ని కెనడా, మెక్సికో వస్తువులపై సుంకాలను ఏప్రిల్ 2 వరకు వాయిదా వేస్తూ ఆయన తీసుకున్న నిర్ణయం కూడా ఇన్వెస్టర్లను శాంతపరచడంలో విఫలమైంది.



## ఓవైపు రాజమౌళితో సినిమా.. మరోవైపు ఆస్తులు సేల్

పేరుకే హిందీ నటి గానీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది నటి ప్రియాంక చోప్రా. ప్రస్తుతం మహేశ్ బాబురాజమౌళి సినిమాలో కీలక పాత్రలో నటిస్తోంది. ఓవైపు మూవీ చేస్తూనే మరోవైపు ఇక్కడున్న ఆస్తులన్నీ అమ్మేస్తోంది. రీసెంట్ గా అలా కోట్ల రూపాయల డీల్ జరిగినట్లు ఇండెక్స్ ట్యాప్ తెలిపింది.
ముంబైలోని అంధేరిలో ఉన్న ఒబెరాయ్ స్కై గార్డెన్ లో ప్రియాంకకు నాలుగు ఫ్లాట్స్ ఉన్నాయి. ఇప్పుడు వీటినే ఏకంగా రూ.16.17 కోట్లకు విక్రయించింది. 18వ అంతస్తులో మూడు ఫ్లాట్స్, 19వ అంతస్తులో ఉన్న జోడీ యూనిట్ విక్రయించిన వాటిలో ఉన్నాయి.
గతంలోనూ ప్రియాంక.. మన దేశంలోని ఆస్తుల్ని విక్రయించింది. 2021లో వెర్సోవాలోని రెండు ఇళ్లను, 2023లో లోఖండ్ వాలాలోని రెండు పెంట్ హౌసులని అమ్మేసింది. ప్రస్తుతం ఈమెకు గోవా, న్యూయార్క్, లాస్ ఏంజెల్స్ లో సొంత భవనాలు ఉన్నాయి. ప్రస్తుతం కూతురు, భర్తతో కలిసి లాస్ ఏంజెల్స్ లో ఉంటోంది.
ప్రియాంక సినిమాల విషయానికొస్తే.. హాలీవుడ్ లో పలు చిత్రాల్లో నటిస్తోంది. కొన్నాళ్ల క్రితం 'సిటాడెల్' అమెరికన్ వెర్షన్ లో హీరోయిన్ గా చేసింది. ప్రస్తుతం రాజమౌళి మూవీలో ప్రతినాయక పాత్రలో నటిస్తోందని సమాచారం. దీని షూటింగ్ ఇప్పుడు ఒడిశాలో జరుగుతోంది.

# మహిళలకు సందేశమిచ్చిన శివంగి

**ఆనంది ఇప్పటి వరకు పక్కింటి అమ్మాయిగా... చాలా పద్ధతిగా కనిపించే సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. అలాంటి అమ్మాయి ఒక్కసారిగా 'శివంగి' సినిమాలో బోల్డ్ డైలాగ్‌తో రెచ్చిపోయింది. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్, ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. 'వంగే వాళ్లు ఉంటే... మింగే వాళ్లు ఉంటారు... నేను వంగే రకం కాదు... మింగే రకం...' అనే డైలాగ్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. ఈ చిత్రానికి దర్శకత్వం దేవరాజ్ భరణి ధరన్ వహించారు. ఫస్ట్ కాపీ మూవీస్ పతాకంపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మించారు. ఇందులో వరలక్ష్మీ శరత్ కుమార్ ఓ పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించారు. నేడు(మార్చి 7) ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఎలా ఉందో రివ్యూలో చూద్దాం.**

**కథేంటంటే..**
సత్యభామ(ఆనంది)ఓ సాధారణ గృహిణి.ఓ వైపు భర్త అనారోగ్య పరిస్థితులు... మరో వైపు ఆర్థిక సమస్యలు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. దానికి తోడు తన అత్త నుంచి ఎదురయ్యే వేధింపులు తనకు కంటిమీద కునుకు లేకుండా చేస్తాయి. మరోవైపు తల్లిదండ్రులు అనుకోకుండా వరదల్లో చిక్కుకు పోవడంతో మరింత సతమతమవుతుంది. చివరకు పోలీసులను ఆశ్రయిస్తుంది. ఆ తర్వాత ఏం జరిగింది? ఎవరైనా హత్యకు గానీ, ఆత్మహత్యకు గానీ గురయ్యారా? సత్యభామ తనకు ఎదురైన హార్డిల్స్ ను ఎలా అధిగమించిందనేది తెలియాలంటే మూవీని ఓసారి చూడాల్సిందే.

**ఎలా ఉందంటే..**
ఓ సాధారణ మహిళ తనకున్న సమస్యలను ఛేదించే క్రమంలో ఎదురైన ఆటంకాలను ఎలా ఎదుర్కొంది అనేదే ఈ సినిమా కథ. దేవరాజ్ భరణి ధరన్ రచన ఇంకా దర్శకత్వంలో ఎంత జాగ్రత్తలు తీసుకున్నాడు అనేది మీ చిత్రం చూస్తే చాలా క్లియర్ గా అర్థమవుతుంది. స్క్రీన్ మీద ఎక్కువగా ఒకటే వ్యక్తి కనిపిస్తున్నప్పుడు ఆడియన్స్ సాధారణంగా బోర్ ఫీల్ అవుతారు. కానీ ఈ సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులు ఎక్కడా కూడా బోర్ ఫీల్ అయ్యే అవసరం రాదు. ఎంతో ఇంటెన్సిఫైడ్ గా కథ ముందుకు సాగుతూ ఉంటుంది. అసలు జరిగేది నిజమా కాదా అనే ఒక డౌట్ తో ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఎంతో ఆసక్తిగా చూసే విధంగా స్క్రీన్ ప్లే వచ్చేలా రాసుకున్నాడు దర్శకుడు.

**సింగిల్ లోకేషన్ లో...**
క్వాలిటీలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాను తెరకెక్కించాడు దర్శకుడు. సినిమా మొత్తం సింగిల్ లొకేషన్ లో చిత్రీకరణ చేసినప్పుడు ఆర్ట్ వర్క్ ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తుంది. అందుకు తగ్గట్టుగానే బ్యాగ్రౌండ్ యాంబియన్స్ ను సెట్ చేసుకున్నాడు కళాదర్శకుడు రఘు కులకర్ణి. అలాగే ఆడియన్స్ ను ఎంగేజ్ చేసే బ్యాగ్రౌండ్ స్కోర్ అందించాడు సంగీత దర్శకుడు. చిత్రంలో ఎక్కడ కూడా వల్గారిటీ లేదా డబుల్ మీనింగ్ డైలాగులు లేకుండా, చాలా డీసెంట్ గా కుటుంబ సమేతంగా వెళ్లి చూసే విధంగా సినిమాను తెరకెక్కించారు. ఒక మహిళకు అనేక సమస్యలు ఒకే సమయంలో వచ్చినప్పటికీ ఆమె ఆ సమస్యలను మొక్కవోని ధైర్యంతో... ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఎలా నిలబడ్డారు అనేది నేటి మహిళలకు మెసేజ్ ఇచ్చేలా సినిమా వుంది. ప్రపంచ మహిళాదినోత్సవం సందర్భంగా మహిళా ప్రేక్షకులకు మంచి ఇన్స్ పిరేషన్ ఇచ్చే సినిమా 'శివంగి'. నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొనే అనేక సమస్యలును ఇందులో చూపించి... వాటికి పరిష్కార మార్గాలు చూపించారు.

రివ్యూ





**ఎవరెలా చేశారంటే..**
సత్యభామగా చిత్రంలో ప్రముఖ పాత్ర పోషించిన ఆనంది నటన మనం గతంలోనే ఎన్నో చిత్రాలలో చూశాం. అదేవిధంగా ఈ చిత్రంలో కూడా తనదైన మార్క్ సృష్టిస్తూ ఆనంది తనను తాను మరోసారి ప్రూవ్ చేసుకున్నారు. చిత్రం అంతా తానే కనిపిస్తూ ప్రేక్షకులు ఎక్కడా బోర్ కొట్టకుండా తనదైన శైలిలో తన నటనతో ప్రేక్షకులను కట్టిపడేశారు. ఎక్కడా గ్లామర్ షో లేకుండా... కేవలం రెండు చీరలలో మాత్రమే సినిమా అంతా కనిపిస్తూ... తన పవర్ ఫుల్ డైలాగ్స్ తో ఆడియన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. పోలీస్ రోల్ లో గతంలో ఎన్నో చిత్రాలలో నటించినప్పటికీ, ఈ చిత్రంలో తెలంగాణ యాసతో వరలక్ష్మి శరత్ కుమార్ తనలో మరో యాంగిల్ యాక్టింగ్ స్టైల్ ఉందని నిరూపించుకున్నారు. అదే విధంగా చిత్రంలో నటించిన జాన్ విజయ్, కోయా కిషోర్ స్క్రీన్ టైమ్ తక్కువగా ఉన్నప్పటికీ తమ మార్క్ కనిపించేలా నటించి మెప్పించారు. సాంకేతికంగా సినిమా పర్వాలేదు.

## డబుల్ బొనాంజ



శర్వానంద్ హీరోగా అభిలాష్ కంకర దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్. విక్రమ్ సమర్పణలో వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మోటార్ సైకిల్ రేసర్ పాత్రలో శర్వానంద్ నటిస్తున్నారు. గురువారం (మార్చి 6) శర్వానంద్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా నుంచి కొత్త స్టిల్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.
"మూడు తరాల నేపథ్యం, ప్రేమ, కలలు... వంటి అంశాల నేపథ్యంతో ముడిపడి 1990, 2000ప్రారంభంలో సాగే మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్ ఇది" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జిబ్రాన్.నారీ నారీ నడుమ మురారి: శర్వనాంద్ హీరోగా నటిస్తున్న మరో చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య హీరోయిన్లు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఈ సినిమా కొత్త పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇలా బర్త్ డేకి తన ఫ్యాన్స్‌కు శర్వానంద్ డబుల్ బొనాంజ ఇచ్చారు.

**ప్రముఖ సింగర్ కల్పన తాజాగా ఒక వీడియో విడుదల చేశారు. కొద్దిరోజుల క్రితం ఆమె అధిక మోతాదులో నిద్ర మాత్రలు తీసుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో ఆమె భర్తపై మీడియాలో పలు కథనాలు వచ్చాయి. ఈ క్రమంలోనే కల్పన స్పందించారు. తన భర్తపై మీడియాలో ఎలాంటి తప్పుడు కథనాలు ప్రసారం చేయకండి అంటూ ఆమె రిక్వెస్ట్ చేశారు. కేవలం పని ఒత్తిడి వల్ల నిద్ర పట్టకపోవడంతోనే టాబ్లెట్స్ వేసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.**

'నన్ను కాపాడిన మీడియా, పోలీసులకు కృతజ్ఞతలు. స్ట్రెస్ వల్ల గత కొద్దిరోజుల నుంచి నాకు సరిగ్గా నిద్రపట్టడం లేదు. అందువల్లే ట్యాబ్‌లెట్స్ వేసుకున్నాను. అయతే, అది డోస్ ఎక్కువ కావడం వల్లే ఇలా జరిగింది. కానీ, మీడియాలో నాతో పాటు నా భర్త గురించి తప్పుడు ప్రచారం జరుగుతోంది. దాని గురించి అందరికీ వివరణ ఇవ్వాలని ఆసుపత్రి నుంచే మాట్లాడుతున్నాను. నేను ఇప్పుడు పూర్తి క్షేమంగా ఉన్నాను. ప్రస్తుతం 45 ఏళ్ల వయసులో పీహెచ్‌డీ, ఎల్ఎల్‌బీ చేస్తున్నాను. ఇదంతా నా భర్త ప్రసాద్ ప్రభాకర్ ప్రోత్సాహం వల్లే జరుగుతుంది. చాలా రోజులుగా మ్యూజికల్ ప్రోగ్రామ్స్‌లలో పాల్గొనడంతో నిద్ర పట్టడం లేదు. వర్క్ స్ట్రెస్ ఎక్కువగా ఉంది.

## నా భర్తతో ఎలాంటి గొడవలు లేవు.. వీడియో విడుదల చేసిన కల్పన

అందుకోసం వైద్యుల వద్ద చికిత్స తీసుకుంటున్నాను.
వారు సూచించిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం కాకుండా ఓవర్ డోస్ తీసుకోవడం వల్లే స్పృహ తప్పి పడిపోయాను. ఆ సమయంలో నా భర్త కేరళలో ఉండటం వల్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆపై కాలనీ వాసుల, మీడియా సహాయం వల్ల నేను మీ ముందు క్షేమంగా ఉన్నాను. త్వరలోనే మళ్లీ నా పాటలతో మీ ముందుకు వస్తాను. నా జీవితానికి బెస్ట్ గిఫ్ట్ నా భర్త ప్రసాద్ ప్రభాకర్. ఆయనతో పాటు నా కూతురు సహకారం వల్లే నచ్చిన రంగాల్లో రాణిస్తున్నాను. మా కుటుంబంలో ఎలాంటి గొడవలు లేవు.. ఎవరూ తప్పుడు ప్రచారం చేయకండి ప్లీజ్.. నా క్షేమం కోరుకున్న అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ముఖ్యంగా పోలీసులు, మీడియా వారికి కృతజ్ఞతలు' అని ఆమె తెలిపారు.



## నాకేమీ తెలీదు.. ట్రాప్‌లో పడ్డాను – బోరుమన్న రన్యారావు

**బెంగళూరు:** విదేశాల నుంచి బంగారు కడ్డీలను తరలిస్తూ పట్టుబడ్డ కన్నడ నటి రన్యారావు.. తాను అమాయకరాలునని అంటోంది. తాను ట్రాప్ లో పడ్డానని, కావాలని ఇలా అక్రమంగా బంగారు కడ్డీలను తరలించలేదని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారుల ముందు బోరుమంది.
తాను నేరం చేసినట్లు ఒప్పుకుంటూనే, ఇది తాను కావాల్సి చేసిన పని కాదని అధికారుల ముందు చెప్పినట్లు తెలుస్తోంది. డీఆర్ఐ అధికారుల తాజా విచారణలో తాను దుబాయ్ తో పాటు, యూరప్, అమెరికా, మిగతా మిడిల్ ఈస్ట్ దేశాలను తిరిగి వచ్చినట్లు పేర్కొంది.

**గతేడాది కూడా ఇదే తరహాలో,...**
ప్రస్తుత రన్యారావు కేసుకు, గతేడాది చెన్నైలో జరిగిన బంగారం స్మగ్మింగ్ కేసుకు పోలికలు ఉండటంతో ఆ కోణంలో విచారణ ఆరంభించారు అధికారులు. గత సంవత్సరం సాఫ్ట్ వేర్ ఉద్యోగి భార్య 12 కేజీల బంగారాన్ని దుబాయ్ నుంచి తరలిస్తూ అధికారులకు పట్టుబడింది. అయితే తాను ఒక ఫ్రెండ్ వలలో చిక్కుకునే బంగారం స్మగ్మింగ్ చేసినట్లు ఆమె వెల్లడించింది. ఇప్పుడు ఈ కేసును కూడా అదే కోణంలో పరిశీలిస్తున్నారు పోలీసులు. ఇందులో ఎవరు పాత్ర ఉందనే దానిపై ఆరా తీస్తున్నారు. తాను ట్రాప్ లో చిక్కుకునే ఈ కథ నడిపినట్లు ఆమె పేర్కొనడంతో దీని వెనుక ఎవరున్నారు అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.

**ఆమె ఎలక్ట్రానిక్ పరికరాలు సీజ్..**
ప్రస్తుతం డీఆర్ఐ విచారణ ఎదుర్కొంటున్న క్రమంలో రన్యారావుకు చెందిన ఎలక్ట్రానిక్స్ పరికరాలను అధికారాలు ముందుగా సీజ్ చేశారు. మొబైల్ ఫోన్, ల్యాప్ టాప్ తదితర వస్తువుల్ని డీఆర్ఐ అధికారులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆమెకు ఎవరితో లింకులు ఉన్నాయనే కోణాన్ని కూడా పరిశీలిస్తున్నారు. 2024 నుంచి ఆమె జరిపిన ఫైనాన్షియల్ వ్యవహారాలపై కూడా ఆరా తీస్తున్నారు. అసలు ఈ రాకెట్ వెనుక మాస్టర్ మైండ్స్ ఎవరు అనే కోణంలో ప్రధానంగా దర్యాప్తు సాగుతోంది.
కాగా, గత సోమవారం 12 కేజీలకు పైగా బంగారం కడ్డీలను తన బెల్ట్ లో పెట్టుకుని దుబాయ్ నుంచి అక్రమంగా తరలిస్తూ రన్యారావు పట్టుబడిన సంగతి తెలిసిందే. బెంగూళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమె అధికారులకు చిక్కింది. ప్రస్తుతం ఆమె మూడు రోజుల డీఆర్ఐ అధికారుల కస్టడీలో ఉంది. దీనిలో భాగంగా ఆమెను విచారిస్తున్న అధికారులు ఇందులో 'కింగ్ పిన్' ఎవరు అనే కోణంలో దర్యాప్తు సాగిస్తున్నారు.





# శ్రేయస్ అయ్యర్‌కు ప్రమోషన్

**టీమిండియా స్టార్ మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు ప్రమోషన్ లభించనుందని తెలుస్తుంది. శ్రేయస్ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను తిరిగి దక్కించుకోనున్నాడని సమాచారం. ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో అద్భుత ప్రదర్శనల తర్వాత బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. శ్రేయస్ గతేడాది మార్చిలో బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కోల్పోయాడు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో అంచనాలకు మించి రాణించినప్పటికీ బీసీసీఐ అతని కాంట్రాక్ట్‌ను పునరుద్దరించలేదు. గత మార్చిలో శ్రేయస్‌తో పాటు ఇషాన్ కిషన్ కూడా బీసీసీఐ కాంట్రాక్ట్‌ను కోల్పోయాడు.**

శ్రేయస్ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయాక టీమిండియాలో స్థానాన్ని కూడా చేజార్చుకున్నాడు. అయితే దేశవాలీ టోర్నీల్లో అద్భుతంగా రాణించి గోడకు కొట్టిన బంతిలా తిరిగి జట్టులో చోటు సంపాదించాడు. రీఎంట్రీలో శ్రేయస్ మరింత రెచ్చిపోయి ఆడుతున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో 4 మ్యాచ్‌లు ఆడి 79.92 స్ట్రయిక్‌రేట్‌తో 195 పరుగులు చేశాడు. శ్రేయస్ ప్రదర్శనల ఆధారంగా టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీలో అజేయంగా ఫైనల్‌కు చేరింది.

ఈ టోర్నీలో శ్రేయస్ జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు అత్యంత కీలకమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. మొదటి బ్యాటింగ్‌తో పాటు ఛేదనలోనూ సత్తా చాటాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో నిరాశపరిచిన (17 బంతుల్లో 15) శ్రేయస్.. ఆతర్వాత చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో (67 బంతుల్లో 56) మెరిశాడు. చివరి గ్రూప్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై మరో హాఫ్ సెంచరీ చేసిన శ్రేయస్.. ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో విరాట్ కోహ్లితో కలిసి కీలక ఇన్నింగ్స్ (45) ఆడి భారత విజయంలో ప్రధానపాత్ర పోషించాడు.

ఈ ప్రదర్శనల తర్వాత శ్రేయస్‌కు ఎందుకు సెంట్రల్ కాంట్రాక్ట్ ఇవ్వకూడదని చర్చ మొదలైంది. దీంతో బీసీసీఐ శ్రేయస్‌కు తిరిగి సెంట్రల్ కాంట్రాక్ట్ ఇచ్చి గౌరవించుకోవాలని భావిస్తుంది. బీసీసీఐ మరికొద్ది రోజుల్లో అధికారికంగా సెంట్రల్ కాంట్రాక్ట్ ఆటగాళ్ల జాబితాను ప్రకటించనుంది. సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలోకి కొత్తగా వరుణ్ చక్రవర్తి వచ్చే అవకాశం ఉంది.

ఇదిలా ఉంటే, ప్రస్తుతం జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఫైనల్‌కు చేరిన విషయం తెలిసిందే. సెమీస్‌లో ఆసీస్‌ను మట్టి కరిపించిన భారత్ తుది సమరానికి అర్హత సాధించింది. మరోవైపు న్యూజిలాండ్ సెమీస్‌లో సౌతాఫ్రికాను చిత్తు చేసి తుది పోరుకు అర్హత సాధించింది. భారత్, న్యూజిలాండ్ మధ్య ఫైనల్ మ్యాచ్ ఈనెల 9వ తేదీన దుబాయ్ వేదికగా జరుగనుంది. భారతకాలమానం ప్రకారం ఈ మ్యాచ్ మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమవుతుంది.

ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ తలపడటం ఇది రెండో సారి. 2000 ఎడిషన్‌లో ఇరు జట్లు ఎదురెదురుపడగా.. న్యూజిలాండ్ భారత్‌ను ఓడించి తమ తొలి ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ ఇరు జట్లు ఇనాగురల్ డబ్ల్యూటీసీ ఫైనల్లోనూ (20192021) తలపడ్డాయి. ఈసారి కూడా న్యూజిలాండ్ భారత్‌ను ఓడించి తమ రెండో ఐసీసీ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. న్యూజిలాండ్, తమ రెండు ఐసీసీ టైటిళ్లను భారత్‌పైనే గెలవడం విశేషం.



# రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్న టీమిండియా మాజీ కెప్టెన్

**భారత ఫుట్‌బాల్ దిగ్గజం, టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రీ మళ్లీ నీలం రంగు జెర్సీతో బరిలోకి దిగనున్నాడు. 40 ఏళ్ల ఛెత్రీ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నట్లు ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ప్రకటించింది. ఛెత్రీ త్వరలో జరుగనున్న ఫిఫా ఇంటర్నేషనల్ విండోలో భారత్ తరఫున బరిలోకి దిగనున్నాడు. ఫిఫా ఇంటర్నేషనల్ విండో కోసం ప్రకటించిన 26 మంది సభ్యుల భారత జట్టులో ఛెత్రీకి చోటు దక్కింది. ఏడాది గడుస్తున్నా భారత జట్టులో తన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేకపోవడంతో రిటైర్మెంట్ విషయంలో ఛెత్రీ మనసు మార్చుకున్నాడు. పదేళ్లకు పైగా భారత జట్టుకు నాయకత్వం వహించిన ఛెత్రీ.. గతేడాది జూన్ 6న రిటైర్మెంట్ ప్రకటించాడు. కోల్‌కతాలో కువైట్‌తో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్ ఛెత్రీకి చివరిది.**

2005లో భారత్ తరఫున అరంగ్రేటం చేసిన ఛెత్రీ.. భారత ఆల్‌టైమ్ లీడింగ్ గోల్ స్కోరర్‌గా కెరీర్ ముగించాడు. ఛెత్రీ భారత్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగానూ రికార్డు కలిగి ఉన్నాడు.

ఛెత్రీ తన కెరీర్‌లో 94 అంతర్జాతీయ గోల్స్ సాధించాడు. పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో నాలుగో అత్యధిక గోల్ స్కోరర్‌గా ఛెత్రీ కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో దిగ్గజాలు క్రిస్టియానో రొనాల్డో, లియోనల్ మెస్సీ, అలీ దై మాత్రమే ఛెత్రీ కంటే ఎక్కువ గోల్స్ చేశారు.

ఛెత్రీ అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికినప్పటికీ.. ఇండియన్ సూపర్ లీగ్‌లో బెంగళూరు ఎఫ్‌సీకి ప్రాతినిథ్యం వహిస్తూనే ఉన్నాడు. ఈ సీజన్‌లో ఛెత్రీ 12 మ్యాచ్‌ల్లో 23 గోల్స్ చేసి ఐఎస్ఎల్‌లో భారత్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు.

కాగా, భారత ఫుట్‌బాల్ జట్టు ఏఎఫ్‌సీ ఆసియా కప్ సౌదీ అరేబియా 2027 క్వాలిఫయర్స్ ఫైనల్ రౌండ్ సన్నాహకాల్లో భాగంగా మార్చి 19న మాల్దీవ్స్‌తో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనుంది. అనంతరం భారత్ ఏఎఫ్‌సీ ఆసియా కప్ 2027 క్వాలిఫయర్స్‌లో (మార్చి 25) బంగ్లాదేశ్‌తో తలపడనుంది. ఈ టోర్నీలో భారత్.. బంగ్లాదేశ్, హాంగ్‌కాంగ్, సింగపూర్ జట్లతో పోటీపడనుంది. ఈ టోర్నీలో భారత్ మ్యాచ్‌లు షిల్లాంగ్‌లోని జవహర్ లాల్ స్టేడియంలో జరుగనున్నాయి.

ఫిఫా ఇంటర్నేషనల్ విండో కోసం భారత జట్టు..

గోల్ కీపర్స్ అమరిందర్ సింగ్, గుర్మీత్ సింగ్, విశాల్ కైత్

డిఫెండర్స్ ఆషికి కురునియన్, ఆయుశ్ దేవ్ ఛెత్రీ, బ్రాండన్ ఫెర్నాండెస్, బ్రైసన్ ఫెర్నాండెస్, జీక్సన్ సింగ్ థౌనౌజమ్, లాలెంగ్మావియా, లిస్టన్ కొలాకో, మహేశ్ సింగ్ నోరెమ్, సురేశ్ సింగ్ వాంగ్జమ్

ఫార్వర్డ్స్ సునీల్ ఛెత్రీ, ఫరూక్ చౌదరీ, ఇర్ఫాన్ యద్వాద్, లల్లియన్జువాలా ఛంగ్టే, మన్వీర్ సింగ్

# వర్షం ముప్పు లేదు.. మరి 'ఫైనల్'

## టై అయితే విజేతను ఎలా నిర్ణయిస్తారు?

**మరో రెండు రోజుల్లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. వరుసగా మూడోసారి టైటిల్ పోరుకు వచ్చిన టీమ్‌ఇండియా విజేతగా నిలిచేందుకు సిద్ధమవుతోంది.**

**ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకుంది. దుబాయ్ వేదికగా ఆదివారం భారత్ - న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనుంది. పాకిస్థాన్‌లో మాదిరిగా దుబాయ్‌లో మ్యాచ్‌లకు వర్షం ఆటంకం లేదు. దీంతో మ్యాచ్ ఎలాంటి ఇబ్బందిలేకుండా జరుగుతుందని వాతావరణ శాఖ చెబుతోంది. అయితే, 2019 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో మ్యాచ్ టై అయినట్లు.. ఇప్పుడు కూడా టై అయితే పరిస్థితి ఏంటనేది క్రికెట్ అభిమానుల సందేహం. అప్పడంటే బౌండరీలను కౌంట్ చేసి కివీస్‌ను కాదని ఇంగ్లాండ్‌ను విజేతగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఐసీసీ పై తీవ్రస్థాయిలో విమర్శలు రేగాయి. దీంతో ఇలాంటి కీలక సమయంలో మ్యాచ్ టైగా ముగిస్తే విజేతను తేల్చేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. అదేంటో చూద్దాం.**



**వారిదే టైటిల్..**

ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఇరు జట్లూ ఒకే స్కోరు చేసి టై అయిందనుకుందాం. అప్పుడు విజేతను నిర్ణయించేందుకు సూపర్ ఓవర్‌ను వేయిస్తారు. టీ20 ఫార్మాట్‌లో ఇలాంటి విధానాన్ని అమలుచేస్తుంటారు. ఒకవేళ ఆ సూపర్ ఓవర్ కూడా టైగా ముగిస్తే.. మరిన్ని సూపర్ ఓవర్లను ఆడాల్సి ఉంటుంది. విజేత ఎవరనేది తేలేవరకూ తప్పదు. ఆ సూపర్ ఓవర్(ర్లు) ఎవరు గెలుస్తారో వారిదే ఛాంపియన్స్ ట్రోఫీ. ఓడిన జట్టు రన్నరప్‌గా నిలుస్తుంది.

**ఒకవేళ వర్షం వస్తే..**

పాకిస్థాన్‌లో మాదిరిగా దుబాయ్‌లో ఇప్పుడు వర్షం పడే అవకాశం లేదు. అయితే, అనుకోని విధంగా వర్షం వచ్చిందనుకుంటే ఇరు జట్లూ విజేతగా ట్రోఫీని పంచుకుంటాయి. మ్యాచ్ ఫలితం రావాలంటే ఇరు జట్లూ కనీసం 25 ఓవర్ల ఆట ఆడాలి. అప్పుడే డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన విజేతను తేలుస్తారు. వర్షం వల్ల ఫైనల్ రద్దు కావడంతో 2002లో భారత్, శ్రీలంక జట్లు పంచుకొన్న సంగతి తెలిసిందే. రెండు రోజులపాటు మ్యాచ్ సాగినా.. ఒక్కో ఇన్నింగ్స్ మాత్రమే జరిగాయి. ఫలితం తేల్చే అవకాశం లేకపోవడంతో కప్ ఇరు జట్లకూ దక్కింది.

# ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు ముందు

## కోహ్లిని ఊరిస్తున్న మూడు భారీ రికార్డులు

**భారత్, న్యూజిలాండ్ మధ్య ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఫైనల్ మార్చి 9న దుబాయ్ వేదికగా జరుగనుంది. ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి మూడు భారీ రికార్డులు ఊరిస్తున్నాయి. ఈ మ్యాచ్‌లో కోహ్లి మరో 95 పరుగులు చేస్తే వన్డేల్లో న్యూజిలాండ్‌పై అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అవతరిస్తాడు. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిస్తాడు. సచిన్ వన్డేల్లో న్యూజిలాండ్‌పై 1750 పరుగులు చేయగా.. ప్రస్తుతం విరాట్ ఖాతాలో 1656 పరుగులు ఉన్నాయి.**



ఈ మ్యాచ్‌లో (ఫైనల్లో) విరాట్ సెంచరీ సాధిస్తే.. వన్డేల్లో న్యూజిలాండ్‌పై అత్యధిక సెంచరీలు చేసిన భారత బ్యాటర్‌గా సరికొత్త రికార్డు సృష్టిస్తాడు. ప్రస్తుతం ఈ రికార్డు విరాట్, వీరేంద్ర సెహ్వాగ్ పేరిట సంయుక్తంగా ఉంది. వీరిద్దరూ వన్డేల్లో న్యూజిలాండ్‌పై చెరో 6 సెంచరీలు బాదారు.

ఈ మ్యాచ్‌లో విరాట్ మరో 128 పరుగులు చేస్తే.. ఐసీసీ వన్డే నాకౌట్స్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా అవతరిస్తాడు. ప్రస్తుతం ఈ రికార్డు సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. ఐసీసీ వన్డే నాకౌట్స్‌లో మాస్టర్ బ్లాస్టర్ 657 పరుగులు చేశాడు. ప్రస్తుతం విరాట్ ఖాతాలో 530 పరుగులు ఉన్నాయి.

ఈ మ్యాచ్‌లో విరాట్ హాఫ్ సెంచరీ చేస్తే ఐసీసీ వన్డే నాకౌట్స్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన ఆటగాడిగా సచిన్ సరసన నిలుస్తాడు. సచిన్ ఐసీసీ నాకౌట్స్‌లో ఆరు అర్ధ సెంచరీలు చేయగా.. ప్రస్తుతం విరాట్ ఖాతాలో ఐదు అర్ధ శతకాలు ఉన్నాయి.

విరాట్ ఫైనల్లో న్యూజిలాండ్‌పై సెంచరీ సాధించాలని ప్రతి భారత క్రికెట్ అభిమాని కోరుకుంటున్నాడు. అలాగే ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ కూడా ఫామ్‌లోకి రావాలని టీమిండియా ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. టీమిండియాకు కృష్ణార్జులు లాంటి రోహిత్, కోహ్లి భారత్‌కు మరో ఐసీసీ టైటిల్ అందించాలని యావత్ భారతం ఆశిస్తుంది.

**ప్రస్తుతం విరాట్ ఉన్న ఫామ్ ప్రకారం చూస్తే పైన ఉన్న మూడు రికార్డులు బద్దలు కావడం ఖాయంగా కనిపిస్తుంది. ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో విరాట్ ఇప్పటివరకు 4 మ్యాచ్‌లు ఆడి 72.33 సగటున, 83.14 స్ట్రయిక్‌రేట్‌తో 217 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ, ఓ హాఫ్ సెంచరీ ఉన్నాయి. ఫైనల్లో విరాట్ సెంచరీ చేస్తే వన్డేల్లో 52వ శతకం.. ఓవరాల్‌గా 83వ శతకం అవుతుంది.**

**టీమిండియాకు చెడు సూచకం**

ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు ముందు టీమిండియాకు చెడు సూచిస్తుంది. ఐసీసీ టోర్నీల ఫైనల్స్‌లో న్యూజిలాండ్‌ను ఎదుర్కొన్న ప్రతిసారి భారత్‌కు అపజయమే ఎదురైంది. ఐసీసీ టోర్నీల ఫైనల్స్‌లో భారత్, న్యూజిలాండ్ ఇప్పటివరకు రెండు సార్లు ఎదురెదురుపడ్డాయి.

తొలిసారి ఈ ఇరు జట్లు ఛాంపియన్స్ ట్రోఫీ 2000 ఎడిషన్ ఫైనల్లో తలపడ్డాయి. నాడు న్యూజిలాండ్ భారత్‌ను ఓడించి తమ తొలి ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ ఇరు జట్లు ఇనాగురల్ డబ్ల్యూటీసీ ఫైనల్లో (20192021) రెండో సారి పోటీపడ్డాయి. ఈసారి కూడా న్యూజిలాండ్ భారత్‌ను ఓడించి తమ రెండో ఐసీసీ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. న్యూజిలాండ్, తమ రెండు ఐసీసీ టైటిళ్లను భారత్‌పైనే గెలవడం విశేషం.

## ప్లేయర్ ఆఫ్ ద మంత్ నామినీగా శుభ్‌మన్ గిల్..

### రేసులో మరో ఇద్దరు స్టార్లు

ఫిబ్రవరి నెల ప్లేయర్ ఆఫ్ ద మంత్ నామినీల వివరాలను ఐసీసీ ఇవాళ (మార్చి 7) ప్రకటించింది. పురుషుల విభాగంలో టీమిండియా యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్, న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిప్స్, ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్ స్టీవ్ స్మిత్ నామినేట్ అయ్యారు. మహిళల విభాగంలో అలానా కింగ్ (ఆస్ట్రేలియా లెగ్ స్పిన్నర్), అన్నాబెల్ సదర్‌ల్యాండ్ (ఆసీస్ బ్యాటర్), తిసాట్యా పుత్తవోంగ్ (థాయ్‌ల్యాండ్ బౌలర్) నామినీస్‌గా నిలిచారు. ఫిబ్రవరిలో ఆయా ఫార్మాట్లలో అత్యుత్తమ ప్రదర్శనలు కనబర్చిన వారిని ఐసీసీ నామినీస్‌గా ఎంపిక చేసింది. ఓటింగ్ ఆధారంగా ప్లేయర్ ఆఫ్ ద మంత్ విజేతలను ప్రకటిస్తారు.

శుభ్‌మన్ గిల్: ఫిబ్రవరి నెలలో గిల్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ నెలలో అతను 100కుపైగా సగటుతో 406 పరుగులు చేశాడు. ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో గిల్ వరుసగా 87, 60, 112 పరుగులు చేశాడు. అనంతరం ఛాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాదేశ్‌పై మరో సెంచరీ బాదాడు. ఇదే నెలలో గిల్ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి ఎగబాకాడు.

గ్లెన్ ఫిలిప్స్: ఫిబ్రవరి నెలలో ఫిలిప్స్ అద్భుత ప్రదర్శనలు చేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు పాకిస్తాన్‌లో జరిగిన వన్డే సిరీస్‌లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఈ సిరీస్‌లో ఫిలిప్స్ వరుసగా 28 నాటౌట్, 20 నాటౌట్, 106 (74 బంతుల్లో 7 సిక్సర్లు) స్కోర్లు చేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ ఫిలిప్స్ విజృంభించాడు. ఈ మ్యాచ్‌లో ఫిలిప్స్ మెరుపు అర్ధ సెంచరీ (39 బంతుల్లో 61) సాధించాడు. ఇదే మ్యాచ్‌లో ఫిలిప్స్ పాక్ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ క్యాచ్‌ను నమ్మశక్యంకాని రీతిలో అందుకున్నాడు.

స్టీవ్ స్మిత్: ఫిబ్రవరి నెలలో స్మిత్ టెస్ట్‌ల్లో అద్భుతంగా రాణించాడు. ఈ నెలలో శ్రీలంకతో జరిగిన రెండు టెస్ట్‌ల్లో స్మిత్ రెండు సెంచరీలు బాదాడు. ఫలితంగా ఈ సిరీస్‌లో స్మిత్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు గెలుచుకున్నాడు. ఈ ప్రదర్శనలతో స్మిత్ ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టాప్5లోకి చేరుకున్నాడు.

# వీరేంద్ర సెహ్వాగ్ సోదరుడు అరెస్ట్

**టీమిండియా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ సోదరుడు వినోద్ సెహ్వాగ్ అరెస్ట్ అయ్యాడు. చెక్ బౌన్స్ కేసులో చండీఘడ్ పోలీసులు వినోద్ సెహ్వాగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి అనేక మార్లు విచారణకు హాజరుకాకపోవడంతో 2023లో స్థానిక కోర్టు వినోద్ సెహ్వాగ్‌తో పాటు మరో ఇద్దరిని దోషులుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే వినోద్ అరెస్ట్ జరిగింది.**

అరెస్ట్ అనంతరం వినోద్ తరఫు న్యాయవాది సెషన్స్ కోర్టులో బెయిల్ పిటీషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్‌ను పోలీసులు వ్యతిరేకించారు. దీంతో దీనిపై విచారణ మార్చి 10కి వాయిదా పడింది. అప్పటివరకు వినోద్ సెహ్వాగ్ పోలీసుల కస్టడీలోనే ఉండనున్నాడు.

అసలేం జరిగిందంటే.. క్సాల్టా ఫుడ్ అండ్ బేవరేజెస్ కంపెనీలో వినోద్ సెహ్వాగ్‌తో పాటు విష్ణు మిట్టల్, సుధీర్ మల్హోత్రా డైరెక్టర్లుగా ఉన్నారు. ఈ కంపెనీ 2018లో శ్రీ నైనా ప్లాస్టిక్స్ నుండి రూ. 7 కోట్ల విలువైన వస్తువులు కొనుగోలు చేసింది. చెల్లింపుగా, కంపెనీ రూ. కోటి చొప్పున ఏడు వేర్వేరు చెక్కులను జారీ చేసింది.

అయితే అకౌంట్‌లో సరిపడా నిధులు లేని కారణంగా అన్ని చెక్కులు బౌన్స్ అయ్యాయి. పలు ఫాలోఅప్‌ల అనంతరం శ్రీ నైనా ప్లాస్టిక్స్ అధినేత కృష్ణణ్ మోహన్ ఖన్నా కోర్టును ఆశ్రయించారు. స్థానిక కోర్టు క్సాల్టా ఫుడ్ అండ్ బేవరేజెస్ డైరెక్టర్లైన వినోద్ సెహ్వాగ్, విష్ణు మిట్టల్, సుధీర్ మల్హోత్రాను నిందితులుగా ప్రకటించింది. ఈ తీర్పుపై వినోద్ సెహ్వాగ్ సెషన్స్ కోర్టును ఆశ్రయించారు.

ఇదిలా ఉంటే, వీరేంద్ర సెహ్వాగ్‌కు సంబంధించి ఇటీవలికాలంలో వచ్చిన రెండో వార్త ఇది. వీరూ అతని భార్యతో విడాకులు తీసుకోనున్నాడని కొద్ది రోజుల కిందట సోషల్‌మీడియా కోడై కూసింది. ఇన్‌స్టాలో వీరూ, అతని సతీమణి ఇద్దరు అన్‌ఫాలో చేయడంతో ఈ ప్రచారం మొదలైంది. వీరూ గత కొద్ది రోజులుగా తన భార్యను విడిచి పెట్టి, తన ఇద్దరు పిల్లలతో పాటు వేరుగా ఉంటున్నట్లు తెలుస్తుంది. తరుచూ పుణ్యక్షేత్రాలు తిరిగే వీరూ ఈ మధ్యకాలంలో ఒంటరిగా ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు.



46 ఏళ్ల వీరేంద్ర సెహ్వాగ్ 2013లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. అప్పటినుంచి కామెంటేటర్‌గా, విశ్లేషకుడిగా క్రికెట్‌తో సంబంధం కలిగి ఉంటున్నాడు. సెహ్వాగ్‌కు ఇద్దరు కొడుకులు. ఈ ఇద్దరూ క్రికెటర్లే కావడం విశేషం. సెహ్వాగ్ పెద్ద కొడుకు ఇటీవలికాలంలో జూనియర్ క్రికెట్‌లో సత్తా చాటి వార్తల్లో నిలిచాడు. సెహ్వాగ్‌కు టీమిండియా విధ్వంసకర బ్యాటర్‌గా పేరుండేది. సెహ్వాగ్ భారత్ తరఫున టెస్ట్‌ల్లో తొలి ట్రిపుల్ సెంచరీ చేసిన ఆటగాడిగా చరిత్రకెక్కాడు. సెహ్వాగ్ తన కెరీర్‌లో రెండు ట్రిపుల్ సెంచరీలు చేశాడు. కేవలం బ్రాడ్‌మన్, గేల్, లారా మాత్రమే ఈ ఘనత సాధించారు.